## సంపాదకీయం

# యుద్ధసత్యాలు – మన కర్తవ్యం

అధికారం చేతిలో ఉన్నవాళ్ల అభిప్రాయాలే సత్యంగా చలామణి అవుతాయన్న విషయం ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం సందర్భంగా చాలా బలంగా రుజువయింది.

అయినప్పటికీ దానిని ప్రశ్నించే గొంతులు లేకపోలేదు. వాటికి కూడా ప్రసార సాధనాలు చోటు కల్పించకపోలేదు. ముఖ్యంగా, ఇప్పటివరకు ప్రపంచ పాలకుల అజమాయిషీకి అతీతంగా ఉంటున్న ఇంటర్‌నెట్‌లో విమర్శనాత్మక స్వరాలు బలంగానే వినపడ్డాయి.

తెలుగు పాఠకులకు సులభంగా అందుబాటులో లేని ఈ వ్యాసాలను, ఉపన్యాసాలను, ఇంటర్వ్యూలను అనువదించి మా నాలుగవ బులెటిన్‌గా మీ ముందు ఉంచుతున్నాం. తెలుగులోనే రాసిన ఒకటి రెండు వ్యాసాలను వాటితోబాటు చేర్చాము.

అప్పటికి చర్చలో ఉన్న ముఖ్యమైన హక్కులకు సంబంధించిన విషయాలపైన వివరణాత్మకమైన వ్యాసాలు ప్రచురించడం మా బులెటిన్లు తీసుకురావడంలో మేము ఇప్పటివరకు అనుసరించిన పాలసీ. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం, దాని పూర్వాపరాలు అన్నిటినీ తలదన్నే ప్రాముఖ్యాన్ని సంపాదించాయి కాబట్టి ఈ నాలుగవ బులెటిన్ పూర్తిగా దానికే అంకితమయింది.

ఇవి ఎక్కువగా విదేశీయులు రాసిన వ్యాసాలు కావడం వల్ల వీటిలో ఇండియా వైఖరి గురించి ఎక్కువ లేదు. దాని గురించి నాలుగు మాటలు ఇక్కడ చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. భారత ప్రభుత్వం సెప్టెంబర్ 11 నుండి ఇవాళ్టి దాకా ఈ మొత్తం వ్యవహారంలో అమానవీయమైన అవకాశవాదాన్నీ సిగ్గుమాలిన లేకితనాన్నీ ప్రదర్శించిందనడంలో అతిశయోక్తి లేదు. అయితే భారతీయ సమాజం కూడా అంతకంటె మెరుగుగా స్పందించకపోవడం మరీ బాధాకరం.

ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు మనకు నైసర్గికంగానే కాక సాంస్కృతికంగానూ రాజకీయంగానూ

సన్నిహితులు. ఆ దేశంతో అమెరికాకు ఘర్షణ వచ్చినప్పుడు మన సానుభూతి సహజంగా వాళ్ల పక్షాన ఉండవలసింది – అక్కడ అధికారంలో వున్న వారి తప్పొప్పుల సంగతి పక్కనపెట్టి. ఎటొచ్చీ 'ముస్లిం' అనే తెర ఒకటి అడ్డమొచ్చి ఆ సహానుభూతిని లేకుండా చేసింది.

మన స్కూలు పిల్లలు చదువుకునే జాతీయోద్యమ చరిత్రలో మెచ్చుకోలుగా ప్రస్తావించే 'సరిహద్దు గాంధీ' ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ ప్రస్తుత పాకిస్తాన్ ప్రాంతానికి చెందినవాడే గానీ, పష్తూన్ (లేక పఖ్తూన్) జాతీయుడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రజలలో మెజారిటీ వారే. పగ, పంతం, ప్రతీకారం ముఖ్య విలువలుగా చలామణి అయిన పష్తూన్‌లలో గాంధేయవాదాన్ని బలంగా నిలబెట్టిన ఘనత, మత ఘర్షణలను గట్టిగా ఎదుర్కొని పష్తూన్‌ల ప్రాంతంలో శాంతి సామరస్యాలను కాపాడిన ఘనచరిత్ర గఫార్‌ఖాన్‌కు, అయన అనుచరులకు ఉంది. వారిలో చాలామంది మతం ప్రాతిపదికన ఏర్పడిన పాకిస్తాన్ ఆవిర్భావాన్ని వ్యతిరేకించినందుకు ఆ కొత్తరాజ్యంలో చాలాకాలం జైలులో ఉన్నారు.

'పష్తూన్' అనగానే తాలిబన్‌లు ముజాహిదీన్‌లు తప్ప వేరే ఏదీ ప్రస్తావనకు రాని ఈరోజులలో ఈ వాస్తవాన్ని ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం అవసరం.

నైసర్గికంగానూ ఆఫ్ఘనిస్తాన్‌కు మన దేశంలోని కరువు ప్రాంతాలతో చాలా పోలిక ఉంది. ఇసుక నేలలలో పచ్చదనానికి తావు ఉన్నకాడ సేద్యం చేస్తూ పశువులను పోషిస్తూ బతికే ఆఫ్ఘన్ ప్రజల జీవితం జార్జిబుష్‌కూ టోనీ బ్లెయిర్‌కూ అర్థం కాకపోవచ్చునేమోగానీ మనకు సులభంగానే అర్థం అయివుండాలి. ఆ బతుకును బుగ్గిచేసే అధికార అహంభావాన్ని మనం స్పాంటేనియస్‌గా ద్వేషించి ఉండాలి.

రుగ్వేదానికి రూపకల్పన చేసింది ఆఫ్ఘనిస్తాన్‌లోనేనంటే అద్వానీకి ఒళ్లు మండుతుందేమోగానీ అది ఒక చారిత్రక సత్యమే. ఆ తరువాత బౌద్ధానికీ ఆ దేశం ఒక ముఖ్య కేంద్రంగా ఉండింది. భారతీయ సంస్కృతికి అనేక రంగాలలో ఔన్నత్యాన్ని చేకూర్చిన మొగలులు ఆఫ్ఘనిస్తాన్ నుండి ఇక్కడికి వచ్చినవారే.

ఇంతగా మనకు సన్నిహితులయిన ప్రజలు 'ముస్లిం' అన్న తెర అడ్డం వచ్చేసరికి పరాయివారయిపోయారు. మనకు ఏరకంగానూ సన్నిహితులు గాని బుష్‌లూ బ్లెయిర్‌లూ మన వాళ్లయ్యారు. ఈ యుద్ధానికి ప్రజలలో అత్యధికంగా మద్దతు లభించిన దేశాలలో అమెరికా, ఇజ్రాయిల్‌ల సరసన ఇండియా నిలబడింది. మన సమాజంలో విపరీతంగా పాకిపోయిన ముస్లిం ద్వేషం తప్ప దీనికి వేరే కారణం లేదు.

ప్రపంచంలో ముస్లింలు అత్యధికంగా నివసించే దేశం ఇండోనీషియా కాగా రెండవ స్థానంలో ఉన్నది ఇండియా. పాకిస్తానయినా వేరే ఏదేశమైనా మన తరువాతనే. ఇటువంటి దేశంలో సెప్టెంబర్ 11, దాని పర్యవసానాల ఫలితంగా ముస్లింలు – ముస్లిమేతరులు అన్న విభజన, అగాధం పెరగకుండా చూసుకోవడం మన ప్రభుత్వం ముఖ్యకర్తవ్యం అయి వుండవలసింది. దాని బదులు ఆ విభజననూ అగాధాన్నీ ద్వేషాన్నీ ఇదే అదనని పెంచడం మన పాలకులు ఒక పనిగా పెట్టుకున్నారు. ఎప్పటినుండో వున్న 'సిమి'ని నిషేధించారు, అయోధ్యలో గుడి కడతామన్న

శపథాన్ని పునరుద్ఘాటించారు, తాజ్‌మహల్‌ను ఖరాబు చేశారు. 'ముస్లిం' తీవ్రవాదుల కోసమేనని స్పష్టం చేస్తూ పోటో ఆర్డినెన్స్‌ను జారీ చేశారు.

దీని దుష్ఫలితాలు సామాజిక ఘర్షణల రూపంలోనూ హింసాకాండ రూపంలోనూ చాలా చూడబోతాం.

విదేశాంగ విధానంలోనూ భారత్‌కు ఒకప్పుడు గౌరవించదగ్గ నీతి ఉండేది. అగ్రరాజ్యాల మధ్య అలీనంగా ఉండాలని, ప్రపంచ రాజకీయాలలో బడుగు దేశాలను ఒకటి చేయాలనీ, ఐక్యరాజ్య సమితిని బలోపేతం చేయాలనీ, నిరాయుధీకరణ వంటి లక్ష్యాలకోసం పని చేయాలనీ – ఇటువంటి విలువలకు మన విదేశాంగ నీతిలో స్థానం ఉండేది. ఆచరణలో ఈ నీతి సోవియట్ కూటమి ప్రయోజనాలకు అనేక సందర్భాలలో తాకట్టు పడినప్పటికీ సూత్రప్రాయంగా అది గౌరవించదగ్గది.

ఇప్పుడు మనకు ఏ నీతీ లేదన్న విషయం ఈ రెండు నెలలలో స్పష్టంగా రుజువయింది. పాకిస్తాన్‌ను భ్రష్టు పట్టించడం తప్ప మన విదేశాంగ విధానానికి వేరే లక్ష్యమేదీ ఇప్పుడు లేదు. అమెరికా పాకిస్తాన్‌కు ఎక్కడ దగ్గరయిపోతుందో అన్న భయం మన ప్రభుత్వం చర్యలన్నిటినీ శాసించింది.

పాకిస్తాన్ కంటె ముందు మనమే మన భూభాగాన్ని అమెరికా తన యుద్ధ అవసరాలకోసం వాడుకోవచ్చునని ప్రకటించాం. పాకిస్తాన్‌ను నమ్మొద్దని అమెరికాను హెచ్చరించాం. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం ముగిసే లోపల 'కాశ్మీర్ సమస్య'ను కూడా మనకు అనుకూలంగా 'పరిష్కరించేసు'కోవాలని ఆరాటపడ్డాం. అందుకు విరుద్ధంగా జరుగుతుందేమోనని భయపడ్డాం.

తాలిబన్లు దెబ్బతినగానే అమెరికా, దాని 'అంతర్జాతీయ కూటమి'లోని దేశాలు, తమ ప్రయోజనాలకు తగిన ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్తాన్‌పైన రుద్దాలని ప్రయత్నం మొదలుపెట్టగా ఆ దౌర్జన్యంలో మనకు కూడా కొంచెం వాటా కావాలని కోరాము. ఇవ్వలేదని అలిగాము. ఎవ్వరూ అడగకుండానే ఆఫ్ఘనిస్తాన్‌లో నూతన ప్రభుత్వం ఏవిధంగా వుంటే మంచిదని మనం అనుకుంటున్నామో ప్రకటించాం.

ఆఫ్ఘనిస్తాన్ భవితవ్యాన్ని ఆ దేశ ప్రజల ఇష్టానికి వదిలేద్దాం అనలేకపోయాము. సెప్టెంబర్ 11 నాటి దౌర్జన్యానికి జవాబు ఐక్యరాజ్యసమితి ద్వారా అన్వేషించాలని అనలేకపోయాము. కనీసం, యాభై ఏళ్లుగా అమెరికా అంతర్జాతీయంగా అనుసరిస్తున్న దౌర్జన్యపూరితమైన విధానాలు సెప్టెంబర్ 11కు దారితీశాయని, ఇకనైనా ఆ దౌర్జన్యాన్ని అమెరికా వదిలిపెట్టాలనీ, ఐక్యరాజ్యసమితికి స్ఫూర్తినిచ్చిన శాంతి, ప్రజాస్వామ్యాల కాంక్షను పూర్తిస్థాయిలో పునరుద్ధరించడానికి అందరమూ పూనుకుందామనీ అనలేకపోయాము.

'ఉగ్రవాదాన్ని మట్టుబెట్టడం' అనే కర్తవ్యాన్ని ప్రపంచ దేశాల ప్రభుత్వాలన్నీ అమెరికా నాయకత్వం కింద ఒకట్టై ప్రపంచ ప్రజల ముందు ఉంచాయి. వారు లేవదీస్తున్న సమస్య సమస్యే కాదని అనలేము గానీ, అంతకంటె ముఖ్యమైన సమస్య ఈ ప్రభుత్వాల విచ్చలవిడితనాన్ని ఎవరు నియంత్రించాలి, ఏవిధంగా నియంత్రించాలి అనేది. ప్రభుత్వాల విచ్చలవిడి అణచివేతే

‘ఉగ్రవాదం’ అని పిలవబడే సాయుధ రాజకీయాలకు మూలం అనేది అన్ని సందర్భాలలోనూ సత్యం కాకపోవచ్చును గానీ దీనిని అదుపు చేస్తే దానిని నియంత్రించవచ్చుననేది చాలావరకు సత్యం.

ప్రభుత్వాల నడవడికను నియంత్రించడానికే ఒకనాడు లీగ్ ఆఫ్ నేషన్స్, ఆ తరువాత ఐక్యరాజ్యసమితి ఏర్పడ్డాయి. ఆ రెండింటి నిర్మాణంలోనూ అప్రజాస్వామిక లక్షణాలు మెండుగా ఉండడం వల్ల, ఇతర కారణాల వల్ల అవి తమ లక్ష్యాన్ని పెద్దగా సాధించలేకపోయాయి. అయినప్పటికీ వాటికి స్ఫూర్తినిచ్చిన ఆకాంక్షకు తిరిగి ప్రాణం పోయడం తప్ప ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దడానికి వేరే మార్గం లేదు.

దానితోబాటు మనబోటి దేశాలలో ముస్లింల పట్ల పెరుగుతున్న ద్వేషాన్నీ, ముస్లింలకూ ఇతరులకూ మధ్య పెరుగుతున్న అగాధాన్నీ ఎదుర్కొనడం చాలా అవసరం. లేనట్లయితే అమెరికా తన ప్రయోజనాలన్నిటినీ పదిలం చేసుకుని దక్షిణాసియా నుండి బయటపడే నాటికి మన సమాజాలు మరింత క్రూరంగా, వికారంగా తయారయి వుంటాయి.

మానవ హక్కుల వేదిక

*20.11.2001*